క్లుప్తంగా

నిబంధనలు పాటించాలి



ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లతో మాట్లాడుతున్న ఎంవీఐ వంశీధర్

వేములవాడ: సరైన ధ్రువీకరణ పత్రాలు, నిబంధనలు పాటించకుండా రోడ్లపై ట్రాక్టర్లు నడిపితే చర్యలు తీసుకుంటామని ఎంవీఐ వంశీధర్ సూచించారు. వేములవాడ పట్టణంలోని బైపాస్‌రోడ్డులో ట్రాక్టర్ యజమానులు, డ్రైవర్లకు గురువారం అవగాహన కల్పించారు. సరైన ధ్రువీకరణ పత్రాలు లేకుంటే జరిమానా విధిస్తామన్నారు. రోడ్లపై ట్రాక్టర్లు ర్యాష్‌గా నడుపుతున్నట్లు తమ దృష్టికి వచ్చిందనీ, పరిమితిని మించి ఓవర్‌లోడ్ వెళ్లొద్దన్నారు. మైనర్లకు వాహనాలు ఇచ్చి ఓనర్లు ఇబ్బందులు తెచ్చుకోవద్దన్నారు.

నేటినుంచి ఉచిత కంటి వైద్యశిబిరం



ముస్తాబాద్: ముస్తాబాద్ మాతృశ్రీ ఫంక్షన్ హాల్‌లో ఆరు రోజులపాటు ఉచిత మెగా కంటి వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ప్రముఖ వైద్యుడు డాక్టర్ చింతోజు శంకర్, అమెరికా జనరల్ ఫిజీషియన్ డాక్టర్ కల్వకుంట్ల లక్ష్మణ్‌రావు తెలిపారు. కల్వకుంట్ల రమాదేవి స్మారకార్థం ముస్తాబాద్‌లో శంకర నేత్రాలయ మద్రాస్ ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్యశిబిరం నిర్వహిస్తున్నామన్నారు. జిల్లా ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిబిరంలో అవసరమైన వారికి అధునాతన ఆపరేషన్ థియేటర్‌లో ప్రముఖ సర్జన్ అలెక్స్ కంటి ఆపరేషన్లు చేస్తారన్నారు. రోగులు, కుటుంబీకులకు ఉచిత భోజన వసతి కల్పించామన్నారు.

ఎల్‌వోసీ మంజూరు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం చీర్లవంచకు చెందిన దేవయ్య అనారోగ్యంతో బాధపడుతుండగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ వైద్య ఖర్చులకు రూ.2 లక్షల ఎల్‌వోసీ మంజూరు చేయించారు. ఈ సందర్భంగా దేవయ్య కుటుంబ సభ్యులు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్‌కు ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

ఇంటర్ 'ద్వితీయ' పరీక్షలు ప్రారంభం

ఎల్లారెడ్డిపేట: మండలంలో ఇంటర్ ద్వితీయ సంవత్సరం పరీక్షలు గురువారం ప్రారంభమయ్యాయి. మండలంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాల, రాచర్లజూనియర్ కళాశాలల్లో రెండు పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేశారు. ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు రెండు కేంద్రాల్లో మొత్తం 414మంది పరీక్ష రాయాల్సి ఉండగా, 5గురు గైర్హాజరుకాగా 409 మంది పరీక్షలు రాశారు.

ఇల్లంతకుంటలో..



ఇల్లంతకుంట: ఇల్లంతకుంట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం పరీక్షల్లో 242 మంది విద్యార్థులు హాజరైనట్లు కళాశాల పరీక్షల చీఫ్ సూపరింటెండెంట్ ఎస్ మల్లారెడ్డి తెలిపారు.

నియామకం



జయశ్రీని అభినందిస్తున్న నాయకులు

కోనరావుపేట: బీజేపీ మహిళా మోర్చా మండలశాఖ అధ్యక్షురాలిగా తీగల జయశ్రీని నియమించినట్లు మండల శాఖ అధ్యక్షుడు మిర్యాల్‌కార్ బాలాజీ తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షురాలు పల్లం అన్నపూర్ణ, బీజేపీ, బీజేవైఎం నాయకులు పాల్గొన్నారు.

కళ్లద్దాలు పంపిణీ

గంభీరావుపేట: ఎల్‌వీ ప్రసాద్ ఇనిస్టిట్యూట్ సామాజిక సేవా కార్యక్రమాల్లో భాగంగా లింగన్నపేట జెడ్పీ పాఠశాలలో కంటి చూపు సమస్యతో బాధపడుతున్న విద్యార్థులకు గురువారం కళ్లద్దాలు పంపిణీ చేశారు. ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు రాజిరెడ్డి, ప్రతినిధులు రాజు, రవళి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

జాత్రాగ్రౌండ్‌లో గుర్తుతెలియని కారు

వేములవాడ: రాజన్న ఆలయ పార్కింగ్ స్థలంలో 20 రోజులుగా ఓ గుర్తు తెలియని కారు కనిపించడంతో స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఆ కారును ఠాణాకు తరలించి నంబర్ సాయంతో ఓనర్‌ను గుర్తించే పనిలో ఉన్నట్లు టౌన్ సీఐ వీరప్రసాద్ తెలిపారు.

ఇసుక కొరత.. నిలిచిన పనులు

- మర్రిపల్లిలో నత్తనడకన ఎల్లంపల్లి ప్రాజెక్టు పనులు
- ఇసుక కొరతతో ఆలస్యం
- ఇప్పటివరకు 50శాతం మాత్రమే పనులు పూర్తి



మర్రిపల్లిలో నిలిచిన వాహనాలు

వేములవాడరూరల్: వేములవాడ రూరల్ మండలంలోని మర్రిపల్లి గ్రామంలో నిర్మిస్తున్న శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు పనులు గత ప్రభుత్వ హయాం నుంచి కొనసాగుతున్నాయి. దాదాపు రూ.10 కోట్లతో ప్రాజెక్టు నిర్మిస్తుండగా ఈ ప్రాజెక్టు కింద 3,500 ఎకరాల భూములు ఉన్నాయి. ఇప్పటివరకు 50 శాతం మాత్రమే పనులు పూర్తయ్యాయి. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీమేరకు కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ ప్రాజెక్టు పనులను మళ్లీ ప్రారంభించారు. ఏడాదిగా పనులు సాగుతుండగా జూన్‌వరకు పూర్తిచేయాల్సి ఉంది. సదరు కాంట్రాక్టర్ పనులు చేస్తుండగా ఇసుక సమస్య తలనొప్పిగా మారింది. ఇసుక అక్రమ రవాణాపై జిల్లా పోలీస్, రెవెన్యూ యంత్రాంగం ప్రత్యేక దృష్టిసారించడంతో పాటు ఇసుక అక్రమ రవాణాను అడ్డుకట్ట వేసేందుకు ప్రత్యేక స్క్వాడ్ ఏర్పాటు చేశారు. ఈ ప్రాజెక్టుకు కోనరావుపేట మండలంలోని వెంకట్రావుపేట నుంచి గతంలో ఇసుక క్వారీకి అనుమతులు ఉండేవి. ప్రస్తుతం అనుమతులు లేకపోవడంతో ఇసుక లేక పనులు నిలిచిపోయాయి. మరో నాలుగు నెలల్లో ప్రాజెక్టు పనులు పూర్తిచేయాల్సి ఉండగా ఇసుక కొరతతో సదరు కాంట్రాక్టర్ చేసేది ఏమీలేక చేతులెత్తేశారు.

ఈ ఏడాది అంతేనా.?

ఎన్నో ఏళ్లుగా మర్రిపల్లి ప్రాజెక్టు కింద సాగు చేసుకుంటున్న రైతులకు కొన్ని నెలల్లో సాగునీరు అందుతుందని ఆశతో ఉన్నారు. కానీ ఇసుక కొరతతో ప్రాజెక్టు పనులు సదరు కాంట్రాక్టర్ నిలిపివేయడంతో ఈ వర్షాకాలం వరకు కూడా రైతులకు సాగునీరు అందుతుందా అన్న అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు.

> **ఇసుక కొరతతో ఆలస్యం**
>
> మర్రిపల్లి ప్రాజెక్టు పనులు ఇసుక కొరతతో నిలిచిపోయాయి. దాదాపు రూ.10కోట్లతో ప్రాజెక్టు పనులు జరుగుతున్నాయి. ఈ ఏడాది జూన్‌లోపు పూర్తి చేయాలి. కానీ ఇసుక కొరతతో పనుల్లో కొంత ఆలస్యం జరుగుతోంది. ఇప్పటివరకు యాభైశాతం పనులు మాత్రమే పూర్తయ్యాయి.
>
> – ఎంఏ రఫీ, శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు డీఈ

సాగునీరందించి పంటలు కాపాడుతాం



మాట్లాడుతున్న నర్సయ్య

ఎల్లారెడ్డిపేట: మండలంలోని పలు గ్రామాలకు 9వ ప్యాకేజీ కెనాల్‌కు నీరందించే బాధ్యత ప్రభుత్వానిదేనని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. గురువారం మల్కపేట రిజర్వాయర్‌ను కాంగ్రెస్ నాయకులు సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గత 15 రోజుల నుంచి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్‌రెడ్డి, అధికా రులతో మాట్లాడి కెనాల్‌కు నీటిని విడుదల చేయగా, ప్రస్తుతం రైతులు విద్యుత్ మోటార్లు అమర్చి నీటిని వాడుకుంటున్నట్లు తెలిపారు. మధ్య మానేరు నుంచి 0.5 టీఎంసీల నీటిని మల్కపేట రిజర్వాయర్‌కు పంపింగ్ ద్వారా తీసుకొస్తున్నామన్నారు. నెలరోజులు సాగునీరందించి పంటలను కాపాడుతామన్నారు. రైతులతో అక్కపల్లి బుగ్గరాజేశ్వర తండా నుంచి మలక్పేట వరకు దారి పొడవునా షెట్టర్లను పరిశీలించామన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ గుండాడి రాంరెడ్డి, నాయకులు ఎస్‌కే గౌస్, బాలయ్య, గణపతి, శ్రీనివాస్, శ్రీకాంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, లక్ష్మారెడ్డి, బాబు, మల్లారెడ్డి, నర్సింలు, బాల్‌యాదవ్, బాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గం ఎన్నిక



ఎన్నికైన కార్యవర్గ సభ్యులు

ఇల్లంతకుంట: మండలంలోని కందికట్కూర్ అంబేడ్కర్ యువజన సంఘం సభ్యులు గ్రామంలోని అంబేడ్కర్ భవనంలో గురువారం అంబేడ్కర్ యువజన సంఘం కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా పర్శరాములు, ఉపాధ్యక్షులుగా బిగుల్ల అశోక్, పర్శరాములు, కోశాధికారిగా జనగం కరుణాకర్, ప్రధాన కార్యదర్శిగా సావన పెల్లి రాజేశం, కల్చరల్ కార్యదర్శిగా బిగుల్ల స్వామి, ప్రచార కార్యదర్శిగా బిగుళ్ల పర్శరాములు, సలహాదారులుగా తిరుపతి, కొమురయ్య, కార్యవర్గ సభ్యులుగా శంకర్, లింగం, అంజయ్య, రాజయ్య, జనగం పర్శరాములు, బిగుళ్ల పర్శరాములును ఎన్నుకున్నారు.

క్షయ నివారణకు జాగ్రత్తలు తీసుకోవాలి




ముస్తాబాద్: క్షయవ్యాధి నివారణకు అందరూ జాగ్రత్త తీసుకోవాలని వైద్యాధికారి గీతాంజలి సూచించారు. చీకోడు ఆరోగ్య ఉపకేంద్రంలో క్షయ వ్యాధి నిర్ధారణ పరీక్షలను గురువారం నిర్వహించారు. క్షయ అంటూ వ్యాధి అని, ముందస్తు జాగ్రత్త చర్యలు పాటించాలన్నారు. చేతులు శుభ్రంగా కడుక్కోవడం, బహిరంగ ప్రదేశాలకు వెళ్లినప్పుడు మాస్కులు ధరించాలన్నారు. పోషకాహారం తీసుకుని, వ్యాధి నిరోధక శక్తి పెంచుకున్నప్పుడే టీబీ దరిచేరదన్నారు. సూపర్‌వైజర్ లక్ష్మీప్రసాద్, ఎంఎల్‌హెచ్‌పీ ఉదయ్, ఏఎన్‌ఎమ్‌లు పాల్గొన్నారు.

చెట్టు కొమ్మలు తొలగించలే ?

- అయినా జిల్లా ఉన్నతాధికారులకు తప్పుడు నివేదిక



బండపల్లిలో రోడ్డు పక్కన ప్రమాదకరంగా చెట్టు



అధికారులకు పంపిన నివేదిక

చందుర్తి: మండలంలోని బండపల్లి శివారు అర్ అండ్‌బీరోడ్డు పక్క నే ముళ్ల చెట్టు వంగి ప్రమాదకరంగా ఉందని ఈనెల 5న సాక్షిలో ప్రచురితమైన కథనా నికి స్పందించి ఉన్నతా ధికారులు వివరణ కో రారు. దీనికి మండల ఇన్‌చార్జి ఎంపీడీవో రిజాయిండర్‌లో పంచాయ తీ సిబ్బందితో కొమ్మలను తొలగించామని జిల్లా ఉన్నతాధికారులకు తప్పుడు నివేదికతో విమర్శలకు తావిస్తోంది. వాస్తవానికి ప్రమాదకరంగా చెట్టుపై ఒక్క కొమ్మను కూడా తొలగించలేదు. విధులపట్ల నిర్లక్ష్యం వ్యవహరిస్తున్నారని రెండునెలల క్రితం కలెక్టర్ ఇన్‌చార్జి ఎంపీడీవోపై ఆగ్రహం వ్యక్తం చే శారు. తప్పుడు నివేదిక మాత్రం చర్చనీయాంశమైంది.

రెడ్డీల హక్కుల సాధనకు పోరాటం



మాట్లాడుతున్న కృష్ణారెడ్డి

ఎల్లారెడ్డిపేట: జిల్లాలో రెడ్డీల హక్కుల సాధన కోసం ఉమ్మడిగా పోరాటాలు చేస్తామని రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు గుండారపు కృష్ణారెడ్డి అన్నారు. మండలంలోని దుమాల రెడ్డి సంఘం సభ్యులతో గురువారం సమావేశమయ్యారు. నూతనంగా ఎన్నికైన కృష్ణారెడ్డితో పాటు జిల్లా ఉపాధ్యక్షుడు గుల్లపల్లి నర్సింహారెడ్డిని సంఘం సభ్యులు సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రెడ్డి విద్యార్థుల ఉన్నత చదువుల కోసం సంక్షేమ వసతి గృహాలు, పాఠశాలలు ఏర్పాటు చేయాలన్నారు. పేద రెడ్డి పిల్లల చదువుకు ప్రభుత్వం ప్రత్యేక నిధులు కేటాయించాలన్నారు. ప్రతి గ్రామంలో రెడ్డి సంఘం భవనాలతో పాటు జిల్లా కేంద్రంలో భవన నిర్మాణానికి కృషి చేస్తానన్నారు. సమావేశంలో సంఘం ప్రతినిధులు గుల్లపల్లి సత్యనారాయణ రెడ్డి, ఇప్ప రవీందర్‌రెడ్డి, ఇప్ప దేవేందర్‌రెడ్డి, రాంరెడ్డి, లక్ష్మారెడ్డి, బుచ్చిరెడ్డి, రాజిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కొమురవెల్లికి తరలిన కాంగ్రెస్ నాయకులు



కొమురవెల్లి ఆలయం వద్ద కాంగ్రెస్ నాయకులు

తంగళ్లపల్లి: కాంగ్రెస్ మండల అధ్యక్షుడు ప్రవీణ్ జే టోని ఆధ్వర్యంలో గురువారం కాంగ్రెస్ మండల నాయకులు కొమురవెల్లి మల్లన్న ఆలయానికి తరలివెళ్లారు. ఈ సందర్భంగా స్వామివారిని దర్శించుకొని ప్రత్యేకపూజలు చేశారు. కార్యక్రమంలో ఏఎంసీ వైస్ చైర్మన్ నేరెళ్ల నర్సింగం గౌడ్, నియోజకవర్గ యూత్ అధ్యక్షుడు చుక్క రాజశేఖర్, మునిగెల రాజు, సీనియర్ నాయకులు లింగాల భూపతి, కటుకం రాజశేఖర్, మోర లక్ష్మీరాజం, మాజీ ఎంపీటీసీ బైరినేని రాము, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన



పూజల్లో పాల్గొన్న గ్రామస్తులు

ముస్తాబాద్: మోహినికుంటలో ముత్యాల పోచమ్మ ఆలయంలో విగ్రహ ప్రతిష్టాపన ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నారు. గురువారం అమ్మవారి యంత్ర ప్రతిష్ట, ప్రాణప్రతిష్టను నిర్వహించారు. జయాది, పూర్ణాహుతి చేపట్టారు. మహా నివేదన, మహాపుష్ప, తీర్థప్రసాద వితరణ చేశారు. మాజీ ఎంపీపీ శరత్‌రావు అన్నప్రసాద వితరణ చేశారు. లత,శివకుమార్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

వన్యప్రాణుల దాహార్తి తీర్చుతున్న సిబ్బంది



కుండీల్లో నీరు నింపుతున్న అటవీశాఖ సిబ్బంది

వీర్నపల్లి: మండలసెక్షన్ పరిధిలోని వీర్నపల్లి, బాబాయి చెరువుతండా గ్రామాల సమీప అటవీప్రాంతంలో అటవీశాఖ సిబ్బంది వన్యప్రాణుల దాహార్తి తీర్చుతున్నారు. గురువారం అటవీశాఖ సెక్షన్ అధికారి భూలక్ష్మి ఆధ్వర్యంలో సాసర్ పిట్, సిమెంట్ కుండీల్లో రోజూ ట్యాంకర్ల ద్వారా నీటిని నింపుతున్నారు. సిబ్బంది కిరణ్, తదితరులున్నారు.

ఒకరిపై కేసు

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బాకూర్‌పల్లితండాలో రోడ్డు వేసే విషయంలో ఘర్షణ పడి ఇద్దరిపై దాడి చేసిన అజ్మీరా రాజుపై గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై రమాకాంత్ వివరాల ప్రకారం.. అజ్మీరా రాంసింగ్‌కు గ్రామంలోని వాటర్‌ట్యాంక్ నుంచి కెనాల్ వరకు సీసీరోడ్డు వేసేందుకు ప్రభుత్వం నుంచి ప్రొసీడింగ్ ఆర్డర్ తీసుకొని రోడ్డు వేశాడు. అయితే అదే గ్రామానికి చెందిన రాజు తన పొలం నుంచి ఎందుకు సీసీరోడ్డు వేశారని ఆరోపిస్తూ రాంసింగ్ భార్య అజ్మీరా లక్ష్మీ, కుమారుడు సాయికుమార్‌పై రాజు దాడిచేశాడు. దీంతో ఈ సంఘటనపై రాంసింగ్ పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

మేకల దొంగతనంపై ఫిర్యాదు

ఎల్లారెడ్డిపేట: స్థానికంగా మటన్ వ్యాపారం చేసే మిర్యాల్‌కార్ శ్రీకాంత్‌కు చెందిన ఐదు గొర్రెలు దొంగతనానికి గురయ్యాయని గురువారం ఫిర్యాదు చేసినట్లు ఎస్సై రమాకాంత్ తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాలు. శ్రీకాంత్‌తోపాటు మిర్యాల్‌కార్ రాజేశ్, మిర్యాల్‌కార్ ఐలోజీలు వెంకటాపూర్ మార్కెట్‌లో 14 గొర్రెపోతులు కొనుగోలు చేశారు. వీటిని ఒగ్గు ఎల్లయ్య మేపడానికి తీసుకెళ్లి సాయంత్రం తిరిగి షెడ్డుకు తెచ్చాడు. అయితే శ్రీకాంత్‌కు చెందిన 6 గొర్రెల్లో ఐదు గొర్రెలు కనిపించలేదు. ఒగ్గు ఎల్లయ్య స్థానిక బైపాస్‌రోడ్డు వద్ద గొర్రెల మందను మేపుతుండగా ఐదింటిని ఎత్తుకెళ్లారని ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్న ఎస్సై తెలిపారు.

పేకాట స్థావరంపై దాడులు

ముస్తాబాద్: పేకాట స్థావరంపై పోలీసులు దాడి చేసి తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నారు. ఎస్సై గణేశ్ తెలిపిన వివరాల ప్రకారం.. రామలక్ష్మణపల్లె శివారులో పేకాట ఆడుతున్నారన్న సమాచారం మేరకు దాడులు చేసి పేకాడుతున్న తొమ్మిది మందిని అదుపులోకి తీసుకున్నామన్నారు. వారి నుంచి రూ.13,340 నగదు, కారు, నాలుగు ద్విచక్ర వాహనాలు, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. తొమ్మిది మందిపై కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నట్లు ఎస్సై పేర్కొన్నారు.



ముస్తాబాద్: మండలకేంద్రంలో వైకుంఠరథం మూలనపడి ఉంది. ఏడాదిన్నరగా పట్టించుకునే వారు లేరు. ఎవరైనా మృతిచెందితే అంతిమయాత్రకు వైకుంఠరథం లేక తిప్పలు పడుతున్నారు. మూలన ఉన్న వైకుంఠ రథాన్ని వినియోగంలోకి తీసుకురావాలని పలువురు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి : బీరయ్య
ఎంపీడీవో, ముస్తాబాద్, సెల్‌నెంబర్ : 9676973358

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్లు: 9440243048, 9705346626

కేటీఆర్‌ను విమర్శిస్తే సహించం



మాట్లాడుతున్న మాట్ల మధు

తంగళ్లపల్లి: కేటీఆర్‌ను విమర్శిస్తే ఊరుకోబోమని జిల్లా మాజీ సర్పంచుల ఫోరం అధ్యక్షుడు మాట్ల మధు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని మార్కండేయ ఆలయహాల్‌లో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా మధు మాట్లాడుతూ కేకే మహేందర్ రెడ్డికి పదవులు రావని, అందుకే ఫ్రస్టేషన్‌లో ఆరోపణలు చేస్తున్నారన్నారు. అవసరమైతే మండలానికి జెడ్పీటీసీగా గెలిచి చూపించాలని సవాల్ విసిరారు. సమావేశంలో మాజీ ఎంపీపీ పడిగెల మానస రాజు, మాజీ సర్పంచ్ కొయ్యడ రమేశ్, సింగిల్‌విండో వైస్‌చైర్మన్ వెంకట రమణారెడ్డి, నాయకులు బండి జగన్, అమర్‌రావు, ప్రేమ్‌కుమార్, రాజయ్య, కృష్ణ, శ్రీకాంత్ రావు, సంధ్యారాణి, నరేశ్, నవీన్ రెడ్డి, రామగౌడ్, కృష్ణారెడ్డి, కరుణాకర్, అఫ్రోజ్, అరవింద్, తదితరులు పాల్గొన్నారు.

ఎస్సీ వర్గీకరణ అమలుచేయాలి



వేములవాడ అర్బన్: డిప్యూటీ తహసీల్దార్ రజితకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

వేములవాడఅర్బన్: వేములవాడ మండల ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో డప్పుకళాకారుల మహాప్రదర్శనతో మండల అధ్యక్షుడు జింక శ్రీనివాస్ ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్ నుంచి తహసీల్దార్ కార్యాలయం వరకు తరలివెళ్లారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ రజితకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జస్టిస్ షమీమ్ అక్తర్ కమిటీలోని లోపాలను సవరించి ఎస్సీ వర్గీకరణ ప్రక్రియ పూర్తి చేయాలన్నారు. రాష్ట్ర నాయకులు గుండా థామస్, పడిగేల బాబు, దోమకొండ మహేందర్, మనోజ్, నర్సయ్య, ప్రతాప్, రాములు, మల్లేశం, దేవరాజు తదితరులు ఉన్నారు.

ఎల్లారెడ్డిపేట: ఎస్సీ వర్గీకరణ రిజర్వేషన్లను ప్రభుత్వం వెంటనే అమలుచేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షులు ఖానాపురం లక్ష్మణ్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో అంబేడ్కర్ విగ్రహానికి పూలమాల వేసిన అనంతరం డప్పు కళాప్రదర్శనతో తహసీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీతీశారు. అనంతరం తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. జస్టిస్ షమీమ్ అక్తర్ నివేదికలో ఉన్న లోపాలను సవరించి వర్గీకరణ ప్రక్రియను పూర్తిచేయాలన్నారు. మండల అధ్యక్షుడు శరవింద్, అన్ని గ్రామాల అధ్యక్షులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కోనరావుపేట: ఎస్సీ రిజర్వేషన్ల వర్గీకరణపై డాక్టర్ షమీమ్ అక్తర్ ఇచ్చిన నివేదికలో ఉన్న లోటుపాట్లను సవరించి అన్ని కులాలకు న్యాయం చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ ఎలగందుల భిక్షపతి అన్నారు. మండలకేంద్రంలో మండలశాఖ అధ్యక్షుడు కొమ్ము రాజశేఖర్ ఆధ్వర్యంలో డప్పులతో ప్రదర్శన నిర్వహించారు. తహసీల్దార్ విజయప్రకాశ్‌రావుకు వినతిపత్రం అందించారు. మండల గౌరవ అధ్యక్షుడు తైదల రాజయ్య, మండల ఉపాధ్యక్షుడు కుమ్మరి దిలీప్, నాయకులు బొడ్డు శంకర్, గంగారం, మల్యాల జాన్సన్, మల్యాల మధుకర్, మల్యాల మనోజ్, భాస్కర్, వివిధ గ్రామాల అధ్యక్షులు, ఉపాధ్యక్షులు, ఉన్నారు.

తంగళ్లపల్లి: తంగళ్లపల్లి తహసీల్దార్ (ఎఫ్ఏసీ) జయంత్ కుమార్‌కు ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు సావనపెల్లి బాలయ్య ఆధ్వర్యంలో వినతిపత్రం అందించారు. అంతకముందు తాడూర్ చౌరస్తా నుంచి డప్పులతో ర్యాలీగా వెళ్లి తహసీల్దార్ కార్యాలయం ఎదుట ఎమ్మార్పీఎస్ నాయకులు నిరసన తెలిపారు. రాష్ట్ర నాయకుడు గుండ్రెడ్డి రాజు, జిల్లా కోకన్వీనర్ సావనపెల్లి రాకేశ్, జిల్లా డప్పు కళాకారుల ఉపాధ్యక్షుడు పసుల దుర్గయ్య, మండల గౌరవ అధ్యక్షుడు మల్యాల లచ్చన్న, ఉపాధ్యక్షుడు కొమ్మెట దేవయ్య, కుర్మా రాజు, రాకేశ్, మునిగె శంకర్, దేవయ్య, కృష్ణభగవాన్, శేఖర్, శ్రీకాంత్, పోచయ్య, మల్లేశ్ పాల్గొన్నారు.



సిరిసిల్ల టౌన్ : అంబేడ్కర్ చౌరస్తా వద్ద సంబరాల్లో పాల్గొన్న బీజేపీ నాయకులు



చందుర్తిలో..

బీజేపీ నాయకుల సంబరాలు

సిరిసిల్ల టౌన్/వేములవాడ/ముస్తాబాద్/ఎల్లారెడ్డిపేట/కోనరావుపేట/తంగళ్లపల్లి/చందుర్తి/ఇల్లంతకుంట/వీర్నపల్లి: పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థి అంజిరెడ్డి గెలుపొందడంతో గురువారం బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. పటాకులు కాల్చి స్వీట్లు పంపిణీ చేశారు. రాజన్న ఆలయం ముందు స్వీట్లు పంచి సంబరాలు జరిపారు. బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ మాట్లాడారు. కోనరావుపేట, ఎల్లారెడ్డిపేట, ముస్తాబాద్, తంగళ్లపల్లి, చందుర్తి, వీర్నపల్లి మండలాల్లో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

లేగదూడపై వీధి కుక్కల దాడి

గంభీరావుపేట: మండలకేంద్రానికి చెందిన లింగారెడ్డి గారి శ్రీనివాస్‌రెడ్డి అనే రైతుకు చెందిన లేగదూడపై వీధి కుక్కలు దాడిచేశాయి. ఈ దాడిలో దూడకు తీవ్ర గాయాలయ్యాయి. వీధి కుక్కల నియంత్రణకు అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.